# కన్నప్పకల

రచయిత:

కవికొండల వేంకటరావు, బి.ఏ., బి.ఎల్.

'కన్నప్పకల' అంటే నేను 1-1-1937 న పగలుగావించిన శ్రీకాళహస్తిదివ్యక్షేత్రయాత్ర అని అనుకోండి. 'కన్నప్ప' అంటే నేనే. 'కల' అంటే ఆనాటి నాయొక్క యాత్రే. వేఱేయెవడో కన్నప్పఅనే మనిషి వుండేవాడు, ఆమనిషి నిద్రపోతూ ఎప్పుడో అర్ధరాత్రి నాడో కలగన్నాడు, ఆకలను నేనేమో అతి విస్తారంగా వర్ణించి చెప్తాను అని కొండంత ఆస పెట్టుకోబోకండి పాఠకులు!

'యాత్ర' అంటే కల ఏలాఅవుతుందీ అని సందేహిస్తారేమో యెవరైనా? యాత్రకూ కలకూ పోలికలు చాలావున్నాయి. ఇల్లూ వాకిలీ మఱచిపోతాం, పొడుగుతా వింత వింతలు తిలకిస్తాం, సాంతం అవుతుందో లేదో అని అడుగడుక్కీ సంశయిస్తానేవుంటాం. కాకపోతే చెప్పండీ! బెజవాడకు నెం॥ 32 వాల్తేరుప్యాసెంజరు సరిగ్గా 19-15కు వచ్చిన బండీ, అసలు గూడూరు తెల్లవాఱగట్ల 4-46 కు చేరవలసింది, తెల్లవారి 7 గంటలకు చేరడమేమిటి చెప్పండీ! అవతల దాని పుణ్యమా అంటూ కాట్పాడిపొయ్యేబండిని ఆ గార్డో, డ్రైవరో, శ్రీకాళహస్తీశ్వరుడో మరో అరగంట ఆపుచేయబట్టి అనుకొన్న ప్రయాణం అనుకొన్నట్టు జరిగిందికాని, లేకపోతే నాయాత్ర ఏంకావలసింది? సగం కలలో లేచికూర్చుని, మనయింటి సరంబీ మీాది చప్పుడుని అనుకున్నట్టుండిపోయేది.—

ఇన్నాళ్లై ఇన్నిసార్లు చన్నపట్నం వెళ్తూ వస్తూవున్నవాణ్ణి, ఈపాతిక ముప్పైయేళ్ళ నుంచీ వొక్కపర్యాయమన్నా గూడూరువద్ద దిగి రేణిగుంటదారి ఎందుకుపట్టానుగాదు, ఇంత అందంగా, ఇంత చిత్రవిచిత్రంగావుండే అని అనుకున్నాను, రైలుబండి వెడుతూ వెడుతూ గంటగంటన్నరలో 'వెంకటగిరి' పట్నాన్ని ఓలోయలో దోబూచులాడిస్తూవుంటే.—ఆ పట్నానికి చేరువనేగల కొండ చాలాదూరంవఱకూ నాదృష్టి నాకర్షిస్తూనే వచ్చింది. ఎక్కడ మాయమైందో అది ఇప్పుడు చెప్పలేనుగాని ప్రక్కకు తిరిగిచూచేలో గమ్యస్థానం కాళహస్తి కనిపించింది. ఇంగ్లీషుపేరు సరిగ్గా 'కాళహస్తి'అని వ్రాయబడివున్నా తెనుగుపేరు 'కాళహస్త్రి' అని వ్రాయబడివున్నట్టు నాకు జ్ఞాపకం. శ్రీకాళహస్తి, కాళహస్తిశ్రీ, కాళహస్త్రి, కాళాస్త్రి, 'కళాస్త్రి' ఇలా భాష కెంతెంత మార్పులువస్తూవున్నా గాథకు మార్పు లుండవు-

గాథ సరిగ్గా నేను వింటూవచ్చినట్టుగానే గుళ్లో చెప్పబడింది. శ్రీ=సాలెపురుగు, కాళ=సర్పము, హస్తి=ఏనుగు, ఈ మూడున్నూ పూజచేసేవట ఆదిని అక్కడ సమహాలింగాన్ని. అందుచేత శ్రీకాళహస్తీశ్వరుడు



183

అనే నామకరణంవచ్చింది. అని ఎన్నిసార్లు నిర్వచించాడో నేనిప్పుడు చెప్పలేను. పదిసార్లు అయినా చెప్పివుంటాడు గుడి అంతా మాకు చూపెట్టినతడు.

(శ్రీ) = సాలెపురుగు, కాళ = సర్పము, హస్తి=ఏనుగు- అంటే అదంతా మొదట్లో ఆమూడింటియొక్క ఆవాసమూ అన్నమాట. పెద్దఅడివిఅని వేతే చెప్పక్కర్లేదు. ఆ అడివిలో వోసన్నినది సువర్ణముఖి అనేది ప్రవహిస్తూవుండేది. ఇప్పటికీవుంది ఆనది. దాని చిత్రమేమిటంటే అది ఆగుడికట్టిన తావునుండి ఉత్తరాభిముఖంగా ప్రవహిస్తూ కనబడుతుంది. భారతవర్షంలో ఉత్తరాభిముఖంగా ప్రవహించేనది అదివొక్కటే అవడంచేత అది మిక్కిలీ పుణ్యవంతమైన మహాస్రవంతిగా పేరెన్నికగాంచింది. నీటిలో ఆకుపచ్చనినాచు కలిసివున్నా, ఆనాచు ముక్కముక్కలుగా విడిపోయి నీటికి నీరు నాచుకు నాచూ అన్నట్టు నీరు పైకెత్తితే నిర్మలంగానే దోచింది. నీటిమీద నోవంతెన కట్టబడివుందికాని, మనుష్యులకంటె గొఱ్ఱెలే మెఱుగన్నట్టు గొఱ్ఱెల మందవొకటి వంతెనకు దిగుచాయగా నీళ్ళల్లోదిగి నడిచిపోవడం ఎక్కువ వినోదవంతంగా నాకు గోచరించింది. బహుశా కన్నప్ప అనే అతను ఆదారమ్మటే నదినిదాటి పూర్వకాలంలో పుట్టలింగాన్ని సందర్శించివుండాలి అని తలపోశాను.

కన్నప్ప! కన్నప్ప! అని పూరికేఅంటే చాలదు. బోయకన్నప్ప! బోయకన్నప్ప! వందకుపైగా నాకు క్రిందగుళ్ళో ఇతర విగ్రహాలు చూపించబడ్డా, వేలకుపైగామించి గోపురంమీది బొమ్మలు పతాకాల్లా గగపించినా, కొండమీద ప్రత్యేకించి సాక్షాత్కరించిన బోయకన్నప్ప నిలువువిగ్రహముందే అది హోయగం వొలికించినట్టువు తేవిగ్రహం వొలికించలేదు. విల్లుపట్టి ఆవిగ్రహం నిలువునా కనిపించగానే, బోయకన్నప్ప సజీవుడై చైతన్యంతో ఎట్టయెదుట నిలుచున్నట్టే వుండిపోయింది నామనోవీథిని. బోయకన్నప్పయొక్క ధనుష్టంకారము కికారణ్యంమీదుగా కొండలోయల్లో ప్రతిధ్వనిస్తూ సువర్ణముఖియొక్క చిన్నియలల బిలబిలధ్వనులలో లీనమై శాంతించినట్టు నావీనులకు సోకింది.

బోయకన్నప్ప వింటినారిలాగి అమ్ము వదులుతూంటే అడివిలో శరభశార్దూల, సింహభల్లూక, లులాయగోలాంగూలాలు, చెల్లాచెదరై పాఱిపోయి ఎక్కడ సందుచిక్కితే అక్కడే నక్కిపోసాగినవి. అతగాని మహదాశయము జంతుకోటిని సంహరిద్దామనికాదు. ఏదో పుష్పసౌరభంకోసం అడివిఅంతా గాలిస్తూవున్నాడతను. పువ్వులేనిచోటునుంచి ఆ పుష్పసౌరభం వస్తూవున్నట్టుకూడా అతను మతిమతీ కనిపెట్టి ఏమిటాయీవింత అని అట్టై, అనుకోని ధనుష్టంకారము ఊరికేనే గావిస్తూవుండేవాడు. చేరువనే సంపెగపువ్వు చూచి ఆపువ్వా అని దాన్నిత్రుంచి మూచూచినప్పటికిన్నీ ఇంకాదాన్ని మించి ఏదో పువ్వుల పరిమళము అపూర్వమైంది అతనికి తగులుతూ వచ్చేది. ఇలాగ్గా తనయొక్క నెమకులాటలో కన్నప్ప అడివిఅంతా తిరగేసి మరగేసి నిశ్చలంగావున్న చాయనొకదాన్ని మాత్రమే తెలుసుకొన్నాడు. ఎట్టకేలకు! గుహ! గుహముందు పెద్ద సాలిగూడు. ప్రచండఝంఝానిలం విసరుతూవున్నా అసలిగూడు కదలడంలేదు. వదులవడంలేదు. తెగడంలేదు. ఊగడంలేదు. ఆలా సన్న[illegible]ల్లెలా, అరగట్టినమల్లెపూలా, కనబడుతూ తనలోనుంచి ఓమహాలింగస్వరూపాన్ని గోచరింపజే

సింది. ఆమహాలింగస్వరూపాన్ని ఓతట్టు దంతావళం, ఓతట్టు కాలసర్పం అర్చిస్తూవున్నాయి. కాలసర్పానికి బుసాలేదు. దంతావళానికి తృషాలేదు. బోయకన్నప్ప విల్లుడించి ముకుళితహస్తుడై 'శ్రీకాళహస్తీశ్వరా! నమస్తే! శ్రీకాళహస్తీశ్వరా! నమస్తే! శ్రీకాళహస్తీశ్వరా! నమస్తే' అని ముమ్మార్లు మ్రొక్కి వెనక్కి తగ్గాడు.

జ్ఞానాంబ ఆగుహనుండి అనూనమూ శ్రీ అమ్మ శేష యివలకు చక్కావచ్చి, తనయొక్క నల్లని కచభరాన్ని, ఆకాశమునుండి చుక్కల్ని రాలుస్తూవుందా అన్నట్టు విదిర్చింది. విదిర్చీ విదర్చడంలో జుత్తు నేవంకనూ పుష్పాలు కనిపించలేదుగాని, సహస్రకోటివివిధపుష్పమంజరులూ తురిమినకొప్పు నవరించుకొన్నప్పుడు గుప్పుమన్నచొప్పు, చెప్పజాలని సురభిళం ప్రభవించి భూనభోంతరాళాల్ని, గంధవహుడు చాలడన్నట్టు ఆవరించివేసింది.

జ్ఞానాంబను అడిగాడు బోయకన్నప్ప 'తల్లీ! ఆశివలింగాన్ని ఆమూటితో నామట్టుగా నాయింటికి గొంపోయి పూజించుకుంటాను' అని. జ్ఞానాంబ అన్నది 'శివలింగము మూటటుంచు, పామునూటటుంచు, ఏనుగు మూటటుంచు, ఈసన్నని సాలిగూటియొక్క పోక్కపోగును వెలితిసేసి తీసికొనిపోగలవు టోయీ! బోయడా! వలసినచో నేను నీతో వత్తును నన్ను గొనిపొమ్ము.' అన్నది జ్ఞానాంబ. అనవుడు బోయకన్నప్పన్నాడు 'తల్లీ! నిన్ను మునుముందుగా కలగుట్టుగా నానట్టింట నెలకొల్పుకొన్నవాణ్ణయియే వే యింతదూరం రాగలిగాను.' అన్నాడు.

జ్ఞానాంబ తిరోహితురాలైంది. కన్నప్పమూలంగా అక్కడో విశాలమైన గుడి వెలిసింది. ఎత్తైన గోపురంనిలిచింది. ఎక్కువైన దివ్యక్షేత్రం బలిసింది. కన్నప్పకల మొక్క మొలిచింది.

---

# అఫీషియల్ లిస్టులో మొదటి పండ్రెండుగురు

[భారతరాజ్యాంగంలోని ఉద్యోగాలలో తరతమ భావం ఈ క్రింది అఫీషియల్‌లిస్టుప్రకారం చెల్లుతూఉంది.]

1. ఇండియా గవర్నర్ జనరల్ (వైస్రాయి).
2. వారివారి రాష్ట్రాల్లో ఆయా రాష్ట్రపు గవర్నర్లు. (అనగా గవర్నరుజనరల్, మదరాసు గవర్నరు ఒక్కసారిగ అస్సాము వెళితే అక్కడ గవర్నరుజనరలు తరువాతిస్థానం ఆరాష్ట్రపు గవర్నరుదేకాని పెద్దరాష్ట్రమైన మదరాసు యొక్క గవర్నరుదికాదు.)
3. మదరాసు, బొంబాయి, బెంగాల్ గవర్నర్లు.
4. ఇండియాగవర్నమెంటు కమాండర్ ఇన్ ఛీఫ్.
5. యూనైటెడ్ ప్రావిన్సు, పంజాబు, బిహారు, ఒరిస్సా, బర్మారాష్ట్రపు గవర్నర్లు.
6. సెంట్రల్ ప్రావిన్సు, అస్సాము, నార్తు వెస్టు ఫ్రాంటియర్ ప్రావిన్సు గవర్నర్లు.
7. బెంగాల్ రాష్ట్రపు ఛీఫ్‌జస్టిస్.
8. గవర్నర్ జనరల్ యొక్క ఎగ్జిక్యూటివ్ కౌన్సిలు సభ్యులు.
9. ఈస్టు ఇండీస్‌నగల బ్రిటిష్ నావిక సైన్యపు కమాండరు ఇన్ ఛీఫ్.
10. కౌన్సిల్ ఆఫ్ స్టేట్ ప్రెసిడెంటు.
11. ఢిల్లి లెజిస్లేటివ్ ఎజంబ్లీ ప్రెసిడెంటు.
12. బెంగాల్‌కు ఇతరమైన రాష్ట్రముల ఛీఫ్‌జస్టిసు.